సాక్షి
తూర్పుగోదావరి
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వర ఆలయంలో నిత్యాన్నదానానికి గిద్ద వీరరాఘవులు (తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం) ఆదివారం రూ.50,116 విరాళం సమర్పించారు.



తీగలకు రాజకీయ అడ్డగింతలు

ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు విపక్ష టీడీపీ మద్దతుదారులు మోకాలడ్డుతున్నారు. - వివరాలు 8లో▸

కడలిలోకి 2.92 లక్షల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం 2,92,297 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 5 వేల చొప్పున మొత్తం 12 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.85, భద్రాచలం వద్ద 22.90 అడుగులుగా నీటి మట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

సీనియర్ సిటిజన్లకు సత్కారం



సీనియర్ సిటిజన్లను సత్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత తదితరులు

చాగల్లు: జిల్లాలో 85 ఏళ్ల వయసు పైబడిన ఓటర్లను గుర్తించి, సన్మానించడం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నామని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా చాగల్లు పంచాయతీ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్లను, సీనియర్ ఓటర్లను ఆదివారం సత్కరించారు. కొవ్వూరు నియోజకవర్గంలో 103 ఏళ్లు నిండిన దాట్ల పద్మావతిని, 85 ఏళ్లు నిండిన మరో 14 మంది వృద్ధులను గుర్తించి, సన్మానించామని ఈ సందర్భంగా కలెక్టర్ చెప్పారు. ఎక్కువసార్లు ఓటు హక్కును వినియోగించుకున్నందుకు అభినందిస్తూ వీరిని సత్కరించామని తెలిపారు. జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువత తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. కొవ్వూరు ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ, జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే వారిని గుర్తించేందుకు నియోజకవర్గంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ బి.రాంప్రసాద్, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, మండల శాఖ గౌరవాధ్యక్షుడు జుట్టా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 4.7 మిల్లీమీటర్ల వర్షపాతం

కొవ్వూరు: జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం 8.30 గంటలతో ముగిసిన 24 గంటల్లో 4.7 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. అనపర్తి, బిక్కవోలు మండలాల్లో గరిష్ఠంగా 19.6 మిల్లీమీటర్లు రికార్డయ్యింది. గోకవరం 9.2, సీతానగరం 8.6, కడియం 7.2, రాజమహేంద్రవరం అర్బన్ 6.4, చాగల్లు 4.6, కొవ్వూరు 4.4, రాజమహేంద్రవరం రూరల్ 3.6, ఉండ్రాజవరం 1.8, రాజానగరం 1.4, నిడదవోలు 1.2, కోరుకొండ ఒక్క మిల్లీమీటర్ చొప్పున వర్షపాతం నమోదైంది.

కోటసత్తెమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానార్చకుడు అప్పారావు శర్మ పర్యవేక్షణలో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. దర్శనాలు, ప్రసాదం, పూజా టిక్కెట్లు, ఫొటోల అమ్మకం ద్వారా అమ్మవారికి రూ.1,05,099 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం (శివ) తెలిపారు.

ఉత్సాహంగా టేబుల్ టెన్నిస్ ఎంపికలు

ప్రకాశం నగర్ (రాజమహేంద్రవరం సిటీ): స్థానిక టౌన్ హాల్ ఎదుట ఉన్న గౌతమీ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జిల్లా టేబుల్ టెన్నిస్ జట్ల ఎంపిక పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. మహిళల విభాగంలో వై.వైష్ణవీ సూర్య, ఛార్వి ఫల్గుణ్, జి.సిరిపావని, పి.శ్రీలక్ష్మి, జి.తాన్యశ్రీ; పురుషుల విభాగంలో టి.ప్రభాత్ సాయి, బి.తనుష్, ఎస్.సూర్యప్రకాష్, చరణ్ కార్తీక్, ఏడీ మణికంఠ, వై.మంజు అవినాష్ ఎంపికయ్యారు. అండర్-17 బాలబాలికల విభాగాల్లో కె.శరణ్యరెడ్డి, కె.అమృతరెడ్డి, కె.కావ్య, ఎస్.తన్వి, ఎస్.త్రిషాల్ రాజ్‌కుమార్, బి.సాయి జోషిత్, నమన్ జైన్, ఎస్.లోహిత్ సూర్య, ఎస్.మోహిత్ శ్రీకపీష్ ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకూ అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి తెలిపారు. ఎంపికలను కోశాధికారి కె.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు పీవీవీ సత్యనారాయణ, కార్యదర్శి వీటీవీ సుబ్బారావు పర్యవేక్షించారు.

పాదగయలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిఠాపురం: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు పిఠాపురం పాదగయ క్షేత్రం, శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానాలను ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. పాదగయ విశిష్టతను అర్చకులు వివరించారు. కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు, దత్తాత్రేయ స్వామి, శ్రీపాద శ్రీవల్లభుడిని దర్శించుకున్నారు. ఆయన వెంట న్యాయమూర్తులు ఎ.వాసంతి, మాధవి, సుధారాణి తదితరులున్నారు. జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులను ఈఓ వడ్డి శ్రీనివాసరావు, చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు ఆలయ మర్యాదలతో సత్కరించారు.

జీవాలతో జీవనం

- గ్రామీణ యువత, రైతుల ఆర్థిక పురోగతికి లైవ్‌స్టాక్ మిషన్ పథకం
- గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల పెంపకంతో ఉపాధి
- సైలేజ్, పశుగ్రాస దిమ్మెలు, సమీకృత దాణా యూనిట్లకూ తోడ్పాటు
- భారీగా సబ్సిడీ, రుణ సదుపాయం



రాజమహేంద్రవరం రూరల్: ఔత్సాహిక రైతులకు, గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ, కేంద్ర ప్రభుత్వ సంస్థ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ సంయుక్తంగా సరికొత్త పథకాన్ని రూపొందించాయి. మేకలు, గొర్రెలు, కోళ్లు, పందుల వంటి జీవాల పెంపకం, పశుగ్రాసం, దాణా తయారీ వంటి వాటి ద్వారా ఉపాధి కల్పించేందుకు ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నాయి. తద్వారా పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తి పెంచి, సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. ఔత్సాహికులు ఆన్‌లైన్‌లో నేరుగా దరఖాస్తు చేసుకోవాలి.

- 500 గొర్రెలు, 25 పొట్టేళ్లతో యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా గొర్రె లేదా మేకపిల్లల ఉత్పత్తి, పోషణ చేపడతారు. ప్రాజెక్టు విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తున్నారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ మంజూరు చేస్తారు.
- కోళ్ల అభివృద్ధి పథకంలో భాగంగా తక్కువ వ్యయంతో కూడిన సాంకేతికతతో యూనిట్‌కు ఆర్థిక సాయం అందిస్తారు. వెయ్యి కోడి పెట్టలు, 100 కోడి పుంజులతో పెరటి కోళ్ల యూనిట్, కోడి పిల్లల ఉత్పత్తి, పాడుగు కోళ్ల యూనిట్ల విలువ రూ.50 లక్షలు అంతకు మించి ఉంటే గరిష్ఠంగా రూ.25 లక్షల రాయితీ మంజూరు చేస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ ఇస్తారు.
- 100 ఆడ పందులు, 10 మగ పందులతో యూనిట్ ఏర్పాటు చేయవచ్చు. ప్రాజెక్టు విలు రూ.60 లక్షలు అంతకు మించి ఉంటే గరిష్ఠంగా



రూ.30 లక్షలు రాయితీ ఇస్తారు. అంతకన్నా తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం, అలాగే 50 ఆడ పందులు, 5 మగ పందుల యూనిట్‌కు గరిష్ఠంగా రూ.15 లక్షల వరకూ రాయితీ ఇస్తారు.
- పశుగ్రాసం, దాణా అభివృద్ధి పథకంలో సైలేజీ తయారీ, పశుగ్రాస దిమ్మల తయారీ, సమీకృత దాణా తయారీ యూనిట్లకు ఆర్థిక సాయం చేస్తారు. యూనిట్ విలువ రూ.కోటి అంతకు మించి ఉంటే గరిష్ఠంగా రూ.50 లక్షల రాయితీ ఇస్తారు. అంతకంటే తక్కువ ఉంటే ప్రాజెక్టు విలువలో 50 శాతం రాయితీ అందిస్తారు.

ఎంపిక ఇలా..

అనుభవం ఉన్న వ్యక్తిగత పశుపోషకులు, రైతు ఉత్పాదక సంస్థలు, స్వయం సహాయక సంఘాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, సెక్షన్-8 కంపెనీల నుంచి అర్హత ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

- లబ్ధిదారు సంబంధిత ప్రాజెక్టులో శిక్షణ పొంది ఉండాలి. ప్రాజెక్టు నిర్వహణపై అవగాహన అవసరం.
- మార్గదర్శకాల ప్రకారం ప్రాజెక్టు నివేదిక తయారు చేసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి.
- రాయితీ పోను మిగిలిన యూనిట్ విలువను బ్యాంకు రుణంగా పొందడానికి అవసరమైన పత్రాలు సమర్పించాలి. బ్యాంకు అనుమతి ఉండాలి.
- సొంత లేదా కౌలు భూమిలో మాత్రమే ప్రాజెక్టు ఏర్పాటు చేయాలి. వీటిని రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలిస్తుంది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్న వారిని ఎంపిక చేసి, జాతీయ లైవ్‌స్టాక్ మిషన్‌కు పంపిస్తారు.

సబ్సిడీ విడుదల

- 50 శాతం సబ్సిడీ రెండు దఫాలుగా విడుదల చేస్తారు.
- బ్యాంకు మొదటి దశ రుణాన్ని లబ్ధిదారుకు అందించిందనే విషయాన్ని ధ్రువీకరించుకున్న తరువాత మాత్రమే మొదటి దఫా సబ్సిడీ మొత్తాన్ని సంబంధిత బ్యాంకుకు జమ చేస్తారు. ఆ సబ్సిడీని లబ్ధిదారు ఖాతాలో ఆ బ్యాంకు జమ చేస్తుంది.
- ప్రాజెక్టు మొత్తం పూర్తయిన తరువాత అధికారులు ధ్రువీకరించుకుని రెండో దఫా సబ్సిడీకి కూడా లబ్ధిదారులను అర్హులుగా పరిగణిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



జాతీయ లైవ్‌స్టాక్ మిషన్ పథకంపై గ్రామీణ యువతకు, ఔత్సాహిక రైతులకు రైతుభరోసా కేంద్రం స్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. ఆన్‌లైన్‌లో నమోదు చేయడం రైతులకు కష్టంగా మారింది. పశు సంవర్ధక శాఖ సిబ్బందికి కూడా అవగాహన కల్పిస్తున్నాం. మండలానికి 200 యూనిట్లు నెలకొల్పి, పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తులు పెంచడమే లక్ష్యంగా పని చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ ఆదేశించారు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవింద్, జిల్లా పశు సంవర్ధక అధికారి

గొర్రెలు/మేకలు ఫాం (యూనిట్)	రాయితీ (రూ.లలో)
100 గొర్రెలు/మేకలు + 5 పొట్టేళ్లు/మేకపోతులు	10,00,000
200 గొర్రెలు/మేకలు + 10 పొట్టేళ్లు/మేకపోతులు	20,00,000
300 గొర్రెలు/మేకలు + 15 పొట్టేళ్లు/మేకపోతులు	30,00,000
400 గొర్రెలు/మేకలు + 20 పొట్టేళ్లు/మేకపోతులు	40,00,000
500 గొర్రెలు/మేకలు + 25 పొట్టేళ్లు/మేకపోతులు	50,00,000

చకచకా..

- ముమ్మరంగా రోడ్డు కం రైల్వే బ్రిడ్జి మరమ్మతులు
- కొనసాగుతున్న తారు రోడ్డు తొలగింపు
- మొత్తం రూ.2.10 కోట్లతో పనులు



రోడ్డు కం రైలు వంతెనపై తారు రోడ్డు లేయర్ తొలగించిన భాగం

కొవ్వూరు: రాజమహేంద్రవరం – కొవ్వూరు మధ్య గోదావరిపై ఉన్న రోడ్డు కం రైలు వంతెన (ఆర్‌సీఆర్‌బీ) మరమ్మతు పనులు చకచకా సాగుతున్నాయి. వంతెనపై రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.2.10 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేపట్టింది. అప్రోచ్ రోడ్లతో కలిపి వంతెన పొడవు 4.473 కిలోమీటర్లు ఉండగా.. దీనిలో ఆదివారం సాయంత్రానికి 2 కిలోమీటర్ల మేర తారు రోడ్డు లేయర్‌ను పూర్తిగా తొలగించారు. నాలుగైదు రోజుల్లో మిగిలిన లేయర్ తొలగింపు పనులు పూర్తవుతాయని ఆర్‌సీఆర్‌బీ డీఈఈ బీవీ మధుసూదనరావు తెలిపారు. ఆయన స్వయంగా దగ్గరుండి ఈ పనులు చేయిస్తున్నారు. సెకండరీ జాయింట్ల వద్ద గతంలో వేసిన గ్లాస్ జియోగ్రిడ్ షీట్లు పాడయ్యాయని, వాటిని కూడా తొలగించి, కొత్తవి వేస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుతం తారు రోడ్డు లేయర్ తొలగింపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. వంతెనపై పేరుకుపోయిన మట్టి, చెత్తను పూర్తి తొలగిస్తున్నామన్నారు. మిల్లింగ్ మెషీన్‌తో తొలగించిన తారు రోడ్డు వ్యర్థాలను ఎప్పటికప్పుడు లారీలతో తరలిస్తున్నామని తెలిపారు.



వంతెనపై పనులు చేస్తున్న వారికి సూచనలిస్తున్న డీఈఈ మధుసూదనరావు

వేకువనే పింఛన్ పిలుపు

- మొదటి రోజే ఠంచన్‌గా ప్రారంభం
- జిల్లాలో 79.89 శాతం మేర పంపిణీ

రాజమహేంద్రవరం రూరల్: తెలతెలవారుతుండగానే గ్రామ/వార్డు వలంటీర్లు పింఛన్ పిలుపుతో లబ్ధిదారుల ఇళ్ల ముందు వాలిపోయారు. జిల్లాలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ఆదివారం ఉదయం పండగ వాతావరణంలో ప్రారంభమైంది. తొలి రోజునే అత్యధిక శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. వలంటీర్లు ఉదయం 5 గంటలకే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, గుడ్‌మార్నింగ్ చెప్పి, పింఛను నగదు అందజేశారు. పింఛను అందుకున్న అవ్వాతాతల ముఖాల్లో ఆనందం వెల్లివెరిసింది. వేలిముద్రలు పడని అవ్వాతాతలకు ఆధార్ ముఖ గుర్తింపుతో పింఛను అందించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పెన్షన్‌దారుల వద్దకు వెళ్లి మరీ పింఛన్లు అందజేయడం విశేషం. జిల్లాలో తొలి రోజు రాత్రి 7 గంటలకు 79.89 శాతం మేర వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ పూర్తయ్యింది. జిల్లావ్యాప్తంగా 2,44,140 మంది లబ్ధిదారులు ఉండగా ప్రభుత్వం రూ.67.37 కోట్లు విడుదల చేసింది. మొదటి రోజు 1,95,166 మందికి రూ.53.82 కోట్లు అందజేశారని డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్ సిరిపురపు సుభాషిణి తెలిపారు.



విశాఖపట్నం ఆసుపత్రిలో వీరాస్వామికి పింఛను అందజేస్తున్న వలంటీర్ మణికంఠ

200 కిలోమీటర్ల దూరం వెళ్లి..

ధవళేశ్వరం: ఆ వలంటీర్ ఏకంగా 200 కిలోమీటర్లు ప్రయాణించి మరీ తన పరిధిలోని ఓ లబ్ధిదారుకు పింఛను అందించారు. ధవళేశ్వరం సచివాలయం -1 పరిధిలోని బొడ్డు వీరాస్వామి డయాలసిస్ పేషెంట్. విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు రూ.10 వేల డయాలసిస్ పింఛన్ సొమ్మును వలంటీర్ అయినం మణికంఠ విశాఖ వెళ్లి మరీ అందజేశారు. మణికంఠను పలువురు అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం



పుష్కర వనాన్ని శుభ్రపరుస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, కలెక్టర్ మాధవీలత



చీపుర్లు పట్టి చెత్తను తుడుస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, కమిషనర్ దినేష్‌కుమార్

రాజానగరం: పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజారోగ్యాన్ని కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. లాలా చెరువు పంచాయతీ పరిధిలోని పుష్కర వనంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కలెక్టర్ తదితరులు స్వయంగా చీపుర్లు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా అంతే అవసరమని చెప్పారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ, స్వచ్ఛత విషయంలో ప్రజలను చైతన్యపరచడానికి ఇటువంటి కార్యక్రమాలు తోడ్పడతాయని అన్నారు. అభివృద్ధి చెందిన దేశాలు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని, మనం కూడా అదే బాటలో పయనిస్తూ, ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా కాపాడుకుందామని అన్నారు. ఒక గంటకు, ఒక రోజుకు పరిమితం కాకుండా స్వచ్ఛత పాటించడం నిరంతర ప్రక్రియగా అలవర్చుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

రాజమహేంద్రవరం సిటీ: కేవలం మన ఇంటినే కాకుండా పరిసరాలతో పాటు నగరాన్ని కూడా అన్ని విధాలా శుభ్రం చేసుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సెంట్రల్ జైల్ పెట్రోలు బంకు సమీపాన నగర పాలక సంస్థ ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ఆయన, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఇటువంటి బృహత్తర కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ వీధి, ఈ నగరం నాది అనే భావన ఉండాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంటే దోమలు, పందులు రావని, తద్వారా రోగాలు దరిచేరవని అన్నారు. నిత్యం కాకపోయినా వారానికి ఒక గంట ఇటువంటి సమాజ సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జగదీష్, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండారు.. సంస్కారహీనుడు

- ఎంపీ మార్గాని ధ్వజం
- మంత్రి రోజాపై అనుచిత వ్యాఖ్యలకు మండిపాటు
- ఆమెకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర మంత్రి ఆర్‌కే రోజానుద్దేశించి టీడీపీ నేత బండారు సత్యనారాయణరావు చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఎంపీ మార్గాని భరత్‌రామ్ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయాల్లో కొనసాగుతూ ఒక మహిళపై దారుణమైన దూషణలకు పాల్పడిన బండారు.. సంస్కారహీనుడిగా నిరూపించుకున్నాడన్నారు. రౌడీలు, దుర్మార్గులు కూడా ఇటువంటి పదజాలంతో దూషించరని అన్నారు. మహిళా మంత్రి పైనే ఇలా మాట్లాడితే ఇక సామాన్య స్త్రీల పరిస్థితేమిటని ప్రశ్నించారు. ఇటువంటి అసభ్యకర వ్యాఖ్యలు చేసిన బండారును అర్ధనగ్నంగా ఊరేగించినా ఆ శిక్ష తక్కువేనని అన్నారు. ఒకవైపు భారత పార్లమెంటు 33 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించి మహిళలకు సముచిత గౌరవం కల్పిస్తూంటే.. సాక్షాత్తూ మన రాష్ట్ర మంత్రి రోజాను అత్యంత అవమానకరంగా దూషించడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. బండారు అనుచిత వ్యాఖ్యలపై రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ ఇప్పటికే డీజీపీకి, జాతీయ మహిళా కమిషన్‌కు లేఖలు రాశారని తెలిపారు. భవిష్యత్తులో ఎవ్వరూ మహిళలపై ఇటువంటి తప్పుడు వ్యాఖ్యలు చేయకుండా కఠినంగా శిక్షించాల్సిందిగా తాము కూడా పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీ భరత్‌రామ్ చెప్పారు. మంత్రి రోజాకు బండారు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ఢిల్లీలో దాక్కున్న లోకేష్

తండ్రి చంద్రబాబు అరెస్టు కాక ముందు బీరాలు పలికిన లోకేష్.. చంద్రబాబు అరెస్టు కాగానే ఢిల్లీ పారిపోయి దాక్కున్నాడని భరత్‌రామ్ ఎద్దేవా చేశారు. స్కిల్ స్కాంలో అరెస్టయిన చంద్రబాబు సెంట్రల్ జైలులో ఉంటే.. తల్లి భువనేశ్వరిని, భార్య బ్రాహ్మణిని వదిలేసి లోకేష్ భయంతో ఢిల్లీలో తల దాచుకోవడం సిగ్గుచేటని అన్నారు. తప్పు చేయబట్టే భయపడి ఢిల్లీలో ఇన్ని రోజులు మకాం పెట్టాడన్నారు. యువగళం పాదయాత్ర కొనసాగిస్తానని తేదీ ప్రకటించి, కార్యకర్తలు, నాయకుల సూచనపై వాయిదా అంటూ లేనిపోని ప్రకటనలు ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో అడుగు పెడితే సీఐడీ ఎక్కడ అరెస్టు చేస్తుందోనని లోకేష్‌కు భయం పట్టుకుందన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు అర్థం చేసుకుని, ప్రజల్లో నుంచి వచ్చిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు.



మార్గాని భరత్‌రామ్

ఆయన జైలులో ఉంటే దప్పులెందుకు?

'మీ నాన్న జైలులో ఉన్నారని దోమలను రావద్దంటే ఎలా? వాటి పని అవి చేసుకుంటాయి. జైలు పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు' అని ఎంపీ భరత్‌రామ్ అన్నారు. చంద్రబాబు జైలులో ఉంటే.. ఏదో పెళ్లిళ్లకో, పండగలకో సంబరాలు చేసుకున్నట్టు.. డప్పుల దరువు, విజిల్స్ దేనికో భువనేశ్వరి, బ్రాహ్మణి చెబితే బాగుంటుందని చమత్కరించారు. చంద్రబాబు జైలు నుంచి ఇప్పట్లో రాలేరని, లోకేష్ బయట ఉన్నా త్వరలో అరెస్టవుతారని, ఇక టీడీపీ బాధ్యతలు తమవే అనే సంతోషంతో అత్తాకోడళ్లు సంబరాలు చేసుకున్నట్టుగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని వేధించినప్పుడు ఆయన.. నాటి ప్రభుత్వంపై ఇలానే కంచాలపై కొడుతూ నిరసన తెలిపారని.. ఇప్పుడు భువనేశ్వరి, బ్రాహ్మణి, టీడీపీ శ్రేణులు చేసిన చర్యలు చూస్తూంటే.. కర్మ సిద్ధాంతం అంటే ఇదేనని అర్థమవుతోందని చెప్పారు. గాంధీ జయంతి రోజున భువనేశ్వరి దీక్ష చేస్తారని తెలిసిందని, అది దేనికో ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. భువనేశ్వరి దీక్షకు మద్దతుగా ఇళ్లలో లైట్లు ఆర్పడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. చంద్రబాబు అరెస్టు వార్త విని రాష్ట్రంలో 97 మంది మృతి చెందారని, ఆయన జైలు నుంచి వచ్చాక మృతుల కుటుంబాలను పరామర్శించి అండగా నిలుస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించడం సిగ్గుగా ఉందని అన్నారు. గోదావరి పుష్కరాలకు రాజమహేంద్రవరంలో చంద్రబాబు ప్రచార ఆర్భాటం వల్ల 29 మంది మృతి చెందారని, మరెంతో మంది తొక్కిసలాట కారణంగా కాళ్లూ చేతులూ కోల్పోయి వికలాంగులయ్యారని, వారి కుటుంబాలను చంద్రబాబు ఎందుకు పరామర్శించ లేదని ఎంపీ భరత్‌రామ్ ప్రశ్నించారు. ఇటువంటి శవ రాజకీయాల వల్లే టీడీపీకి ఉనికి లేకుండా పోయిందని చెప్పారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని.. ఇక చంద్రబాబు నక్కజిత్తుల నాటకాలు సాగవని ఎంపీ భరత్‌రామ్ హెచ్చరించారు.

లోవలో భక్తుల రద్దీ



లోవ ప్రాంగణంలో చెట్ల కింద వంటలు, భోజనాలు చేస్తున్న భక్తులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారిని దర్శించేందుకు వచ్చిన భక్తులతో లోవ దేవస్థానంలో ఆదివారం రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. బాలాలయంలో కొలువు తీరిన అమ్మవారిని క్యూలైన్ల ద్వారా 15 వేల మంది దర్శించుకున్నారని ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. లడ్డూ, పులిహోర ప్రసాదాల ద్వారా రూ.1,33,470, పూజా టికెట్లకు రూ.1,25,550, కేశఖండన శాలకు రూ.11,240, వాహన పూజలకు రూ.4,400, కాటేజీలు, పొంగలి షెడ్లు, వసతి గదుల అద్దెలుగా రూ.82,692, విరాళాలు రూ.2,24,285 కలిపి అమ్మవారికి మొత్తం రూ.5,81,637 ఆదాయం సమకూరిందని వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. వారికి అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటాలు, ప్రసాదాలను ఈఓ అందజేశారు.

క్లుప్తంగా

కాలువలో మునిగి వ్యక్తి మృతి


శ్రీరామప్రసాద్ (ఫైల్)

ఆత్రేయపురం: మండలంలో అంకంపాలెం గ్రామానికి చెందిన కరుటూరి శ్రీరామప్రసాద్ (40) ప్రమాదవశాత్తూ కాలువలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత నెల 30న అతను అంకంపాలెం శివారు గన్నవరం కాలువలో ప్రమాదవశాత్తూ కాలువలో మునిగిపోయినట్లు అతని భార్య నాగవెంకటదుర్గ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ప్రమాదవశాత్తూ కిందపడి..

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో కోరంగి వంతెన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సత్తిబాబు (45) మృతి చెందాడు. కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ కథనం ప్రకారం.. సత్తిబాబు బైక్‌పై కాకినాడ వైపునకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ప్రమాదవశాత్తూ తగలడంతో కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో సత్తిబాబు తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగు మందు తాగి బాలుడు..

ఆత్రేయపురం: మండలంలోని వాడపల్లి గ్రామానికి చెందిన సాధనాల గోవిందు (15) పురుగు మందు తాగి గత నెల 30న మృతి చెందినట్లు ఎస్సై బీవై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆ వివరాల ప్రకారం.. గత నెల 29న రాత్రి గోవిందు మనస్తాపంతో పురుగు మందు తాగాడు. దీంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తల్లి సాధనాల సత్యదుర్గాదేవి ఫిర్యాదు మేరకు శనివారం సాయంత్రం కేసు నమోదు చేశామని ఎస్సై వివరించారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

తుని: స్థానిక జీఆర్పీ పోలీస్ స్టేషన్ పరిధిలో రైలు కిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ తెలిపారు. ఆదివారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కోటనందూరు మండలం పాత కొట్టాం గ్రామానికి చెందిన పెదపూడి రాజీవ్ (36) హంసవరం- తుని రైల్వేస్టేషన్ మధ్యలో లెప్రసీ కాలనీ సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి కల కారణాలు తెలియలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తీగలకు రాజకీయ అడ్డగింతలు

- మెరుగైన విద్యుత్తు సరఫరాకు సర్కారు యత్నం
- భూములివ్వని ప్రతిపక్ష మద్దతుదారులు
- ఉమ్మడి మూడు జిల్లాలకు కష్టకాలం
- ఉన్నతాధికారుల ఉదాశీనతా కారణం



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి: ఏటేటా పెరుగుతున్న అవసరాలు, వినియోగానికి తగినట్లు విద్యుత్ పంపిణీకి మెరుగైన ఏర్పాట్లు చేయడంలో గత టీడీపీ ప్రభుత్వం విఫలమైంది. ముందస్తు ప్రణాళికలను రూపొందించుకుని అమలు చేయకపోవడంతో వినియోగదారులకు ఇక్కట్లు తప్పలేదు. విద్యుత్ సరఫరాలో నిరంతర అవాంతరాలతో ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన లక్షలాది మంది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తక్షణ ఇబ్బందులను తొలగించడంతో పాటు భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రెండేళ్ల కిందటే చర్యలను చేపట్టింది. అయితే ఈ పనులు పూర్తయి విద్యుత్తు సరఫరా సక్రమంగా జరిగితే వినియోగదారుల నుంచి ప్రభుత్వానికి సానుకూలత ఏర్పడుతుందనే భావనతో ఆ గ్రామాల్లో పెద్ద రైతులుగా చలామణి అవుతున్న పలువురు పక్కా ప్రణాళిక ప్రకారం సహాయ నిరాకరణను కొనసాగిస్తున్నారు. తమతో పాటు భూములు ఇవ్వకుండా ఇతర రైతులను కూడా ఉసిగొల్పుతున్నారని సంబంధిత ఉన్నతాధికారులకు నిర్దిష్టమైన సమాచారం ఉంది. ఇలా చేస్తున్న వారిలో ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన వారున్నారని తెలుస్తోంది.

400 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు..

ఉమ్మడి కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో అవాంతరాలు లేని విద్యుత్తు సరఫరాకు వీలుగా కృష్ణా జిల్లా యలమర్రు వద్ద 400 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో పాటు అందుకు అవసరమైన ఫీడర్, లైన్ల నిర్మాణానికి ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయించింది. ఎంఈఐఎల్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని పనులు చేపట్టింది. గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల పరిధిలోని బాపులపాడు, తేలప్రోలు, ఉంగుటూరు, ఆముదాలపల్లి, కొయ్యగూరపాడు, ముక్కపాడు, వింజరంపాడు, వెంట్రప్రగడ, చినపారుపూడి, పెదపారుపూడి మీదుగా యలమర్రుకు 400 కేవీ విద్యుత్తు లైను వెళ్లవలసి ఉంది.

రాజకీయ దురుద్దేశంతో..

విద్యుత్తు లైను నిర్మాణం జరగాలంటే నిర్దేశిత మార్గంలోని భూమి నిర్మాణ సంస్థకు అందుబాటులో ఉండాలి. పనులకు అడ్డంకులు తలెత్తకూడదు. కానీ పై గ్రామాల పరిధిలోని రైతులు ప్రతిపక్ష పార్టీకి అనుకూలురైన పలువురు ఉద్దేశపూర్వకంగానే మోకాలడ్డుతున్నారు. మూడు జిల్లాల పరిధిలోని లక్షలాది మంది వినియోగదారుల సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు.

ఉన్నతాధికారుల జోక్యం అవసరం

విద్యుత్ లైను నిర్మాణం త్వరితగతిన సాగాలన్నా, మూడు జిల్లాల వినియోగదారులకు విద్యుత్తు కష్టాలు తీరాలన్నా రెవెన్యూ, ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా అధికారులు సంబంధిత నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల సహకారంతోనైనా సమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోలవరం కుడి కాలువ తవ్వకం సమయంలో...

రాష్ట్రానికి వరప్రదాయిని అయిన పోలవరం ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి అందరి కలలను సాకారం చేయాలని ఆనాటి ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తలచారు. ప్రాజెక్టు నిర్మాణం రూపుదిద్దుకునేలోపు కుడి, ఎడమ కాలువలను కూడా తవ్వించి నీటిని మళ్లించాలని పనులు ప్రారంభింపచేశారు. కుడి కాలువ పనులు ముందుకు సాగకుండా చేసే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీకి చెందిన ఆయాప్రాంత నాయకులు, రైతులు ఎక్కడికక్కడ అడ్డంకులు సృష్టించారు. కోర్టులను ఆశ్రయించారు. భూములు ఇవ్వకుండా, కాలువ పనులను అడ్డుకోగలిగారు. కానీ భూసమీకరణకు అంగీకరించి తమ భూములను అప్పగించిన ప్రాంతాలలో మాత్రం కాలువ తవ్వకం పనులను వైఎస్ రాజశేఖరరెడ్డి కొనసాగింపచేశారు. ఆ తర్వాత పట్టిసీమ పేరిట టీడీపీ సర్కారు చేపట్టిన ప్రాజెక్టుకు అదే రైతులు సహకరించి భూములు అప్పగించడంతో బిట్లు బిట్లుగా ఆగిపోయిన పోలవరం కుడి కాలువ పనులు పూర్తయ్యాయి. దీంతో నీటిని విడుదల చేయగలిగారు. ఇప్పుడు కూడా పోలవరం కాలువ పనులకు అడ్డంకులు సృష్టించిన రీతిలోనే విద్యుత్తు లైను నిర్మాణానికి మోకాలడ్డుతున్నారనేది తేటతెల్లం అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


ప్రమాద స్థలం వద్ద సేవలందిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

కొవ్వూరు: స్థానిక గామన్ బ్రిడ్జిపై ఆదివారం మధ్యాహ్నం బైక్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందగా, ఆమె భర్త, కుమారుడికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. కోనసీమ జిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన నిడదవోలు వీరలక్ష్మి (32), భర్త రమణ, కుమారుడు వెంకట్‌లతో కలసి మోటారు సైకిల్‌పై గౌరీపట్నం బయలు దేరారు. మార్గ మధ్యంలో కొవ్వూరు- కాతేరు మధ్య గామన్ బ్రిడ్జిపైకి వచ్చేసరికి ముందు వెళ్తున్న లారీని ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించారు. ఆ లారీ వీరి మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. ఈ ఘటనలో వీరలక్ష్మి అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ నడుపుతున్న రమణకు స్వల్పంగా, కుమారుడు వెంకట్‌కు బలమైన గాయాలయ్యాయి. వెంకట్ అపస్మారక స్థితిలో వెళ్లిపోయాడు. అదే సమయంలో నల్లజర్లలో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తున్న ఎంపీ మార్గాని భరత్ రామ్ ప్రమాదాన్ని గుర్తించి తన కాన్వాయ్‌ను ఆపారు. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. ఎంపీ వ్యక్తిగత సిబ్బంది సహాయంతో వెంకట్‌ను అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం తరలించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని సూచించారు.

వీరలక్ష్మీ.. లే

భార్య వీరలక్ష్మి మృతి చెందిన విషయాన్ని రమణ గుర్తించలేదు. అంబులెన్స్‌లో ఆమెను ఎక్కిస్తుండగా అపస్మారకస్థితిలో ఉందని అనుకుని వీరలక్ష్మీ.. లే అంటూ కేకలు వేశారు. అంబులెన్స్ సిబ్బంది వీరలక్ష్మి మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకట్‌కు రాజమహేంద్రవరంలో ప్రాథమిక చికిత్స అనంతరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కొవ్వూరు పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష


ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై ఫోన్‌లో మాట్లాడుతున్న రఘురాం, చిత్రంలో కలెక్టర్, ఎమ్మెల్యేలు కన్నబాబు, పెండెం దొరబాబు, ఎంపీ గీత, దవులూరి దొరబాబు

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 5న సామర్లకోటలో పర్యటించనున్నారు. ఈ ఏర్పాట్లను కలెక్టర్ కృతికా శుక్లా, ముఖ్యమంత్రి ప్రోగ్రామ్ కన్వీనర్ తలశిల రఘురాం, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, పెండెం దొరబాబు ఆదివారం పరిశీలించారు. స్థానిక ఈటీసీ లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లను, దివంగత నేత వైఎస్సార్ విగ్రహం ఏర్పాటు చేసిన పైలాన్, పార్కు తదితర వాటిని చూశారు. సీఎం పర్యటనలో ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆయా శాఖల అధికారులు పనులను పూర్తి చేయాలని సూచించారు. షేర్ వాల్ పద్ధతిలో రూ. 2.15 లక్షలతో నిర్మించిన ఇళ్లతో పాటు, లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్న గృహాలను అధికారులు, ప్రజాప్రతినిధులు చూశారు. ప్రతి ఇంటికీ రంగులు వేయించడంతో పాటు మామిడి తోరణాలతో ఇళ్లను అలంకరించుకునే విధంగా లబ్ధిదారులకు వివరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆయా ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లపై కలెక్టర్ కృతికా శుక్లా, తలశిల రఘురాం చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, డీఎస్పీ లతాకుమారి, సీఐలు అబ్దుల్ నబీ, కె దుర్గాప్రసాద్‌లతో బందోబస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. సామర్లకోట- పెద్దాపురం రోడ్డులో సీఎం హెలిపాడ్ ప్రాంతం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సభా ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేశారు. డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, ఏపీడీ వసంతమాధవి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డీఎల్‌డీఓలు పి.నారాయణమూర్తి, ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమగ్ర శిక్షా ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ (సహిత విద్య) విభాగంలో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ పరిశీలించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఆర్ 20, హెచ్‌ఐ/వీఐ పోస్టులు 22 ఖాళీలున్నాయి. మొత్తం పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి జాబితాలు సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం నుంచి జిల్లా కార్యాలయాలకు చేరుకున్నాయి. ఈ నెల మూడు నుంచి ఐదో తేదీ వరకూ ఉదయం 10 నుంచి ఎంఆర్, హెచ్‌ఐ/వీఐ అభ్యర్థుల సర్టిఫికెట్లను కాకినాడ పీఆర్‌జీ పాఠశాలలో పరిశీలించనున్నారు. 6 నుంచి 9వ తేదీ వరకూ స్కిల్ టెస్ట్/పర్సనాలిటీ టెస్ట్ నిర్వహిస్తారు. 10న ఫైనల్ ఎంపిక జాబితా ప్రదర్శిస్తారు. 11న ఎంపికైన అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ లెటర్లు అందజేస్తారు. 12, 13 తేదీల్లో ఎంపికైన అభ్యర్థులు కాంట్రాక్టు అగ్రిమెంట్ రాయాల్సి ఉంటుంది. 16న విధుల్లో చేరాలి. దరఖాస్తు సమయంలో సమర్పించిన సర్టిఫికెట్ల రెండు సెట్లు గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో పాటు ఆన్‌లైన్‌లో సమర్పించిన దరఖాస్తును అభ్యర్థులు తీసుకురావాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంఆర్ పోస్టులకు 195, వీఐ/హెచ్‌ఐ పోస్టులకు 110 దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం. అభ్యర్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కమిటీని నియమిస్తారు. ఉమ్మడి జిల్లా జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీ మెంబర్ కన్వీనర్‌గా, తూర్పు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లా సమగ్ర శిక్షా ఏపీసీలు మెంబర్లుగా ఉంటారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ కమ్ రోస్టర్ విధానంలో చేపడతారు.

మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్తవిద్య



విద్వత్సభలో స్మార్త, ఆగమ, అపర విద్యపై ఉపన్యసిస్తున్న వేద పండితులు

అమలాపురం టౌన్: మానవాళి నడవడికను నిర్దేశించేదే స్మార్త విద్య అని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం ఆస్థాన విద్వాంసుడు యావని వేంకట రాయచంద్ర సోమయాజ ఘనాపాఠి అన్నారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కూచిమంచి అగ్రహారంలోని శ్రీచంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన స్మార్తాగమ అపర విద్వత్సభకు సోమయాజ ఘనాపాఠి అధ్యక్షత వహించి ఉపన్యసించారు. ఈ సభలో స్మార్త, ఆగమ, అపర విద్యలపై ఘనాపాఠీలు చర్చించారు. సభకు ఉభయ గోదావరి జిల్లాల నుంచి 150 మంది వరకూ స్మార్త పండితులు, పురోహితులు హాజరయ్యారు. అన్ని విద్యలకు వేదం మూలమని, వేదానికి ముడిపడే స్మార్త, ఆగమ, అపర విద్యలు ఉన్నాయన్నారు. పుట్టిన ప్రతి మనవుడిని ఉద్ధరించడానికి చేయాల్సిన 16 కర్మలు ఆపస్తంభుడు సూత్రాలకు అనుగుణంగా జరుగుతాయని వివరించారు. సమాజమంతా పురోహితునికి రుణపడి ఉంటుందన్నారు. సమాజాన్ని ఉద్ధరిస్తూ భావితరాల పిల్లలకు విద్యతో పాటు సంస్కారాన్ని కూడా పూర్తిగా నేర్పాలన్నారు. ఈ బాధ్యత పురోహితులు, తల్లిదండ్రులపై ఉందని స్పష్టం చేశారు. వేదస్మార్త పండితులు కర్రా భాస్కరావధానులు, అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితతావధానులు ఉపన్యసించి స్మార్త విద్యలో ఉన్న విశిష్టతను వివరించారు. శ్రీకోనసీమ వేదశాస్త్ర సన్మాన సభ అధ్యక్షుడు గుళ్లపల్లి ప్రభాకర ఫణిరాజా, కార్యదర్శి గుళ్లపల్లి వెంకట్రామ్, కోశాధికారి యేడిది సుబ్రహ్మణ్యశర్మల పర్యవేక్షణలో ఈ సభ జరిగింది. అనంతరం స్మార్త పండితులను ఘనంగా సత్కరించారు. తర్వాత జరిగిన వేదస్వస్తితో అమలాపురం పట్టణం పావనమైంది. తెలుగు పండితుడు మండలీక ఆదినారాయణతో పాటు వేద, స్మార్త అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణేశ లడ్డూ రూ.1.11 లక్షలు


రూ.1.11 లక్షలకు దక్కించుకున్న వినాయక లడ్డూతో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు

తొండంగి: స్థానిక హౌరా బ్రిడ్జి సెంటర్‌లోని వినాయకుని ఆలయం వద్ద గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం 11 కిలోల స్వామివారి లడ్డూ ప్రసాదానికి ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. దీనిని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. రెండేళ్లుగా గంగబాబు వేలంలో లడ్డూను దక్కించుకుంటున్నారు. ఆయన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. గణేశ యువత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గంతో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

ధవళేశ్వరం: ఏపీ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ధవళేశ్వరంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ సూర్యనారాయణరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎల్ సోమయాజులు ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా డిప్లొమో ఇంజినీర్స్ అసోసియేషన్ నాయకులు ఎ.సాయిరాం, బీవీ నాగేశ్వరరావు వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిగా జీవీ రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.వెంకటరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.నందీశ్వరుడు, ఉపాధ్యక్షులుగా ఎస్.శ్రీకృష్ణ, ఏవీఎస్ఎన్ మోహన్, కేఎన్ఎస్ఎస్ హనుమాన్, ఎస్‌కేఎస్ఎమ్ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా కేఎస్ఎన్ రాజు, సహ కార్యదర్శులుగా టి.హిమవంతరావు, యు.సత్యనారాయణ, ఏవీఎస్ఆర్ఎన్ మూర్తి, వీఎస్‌వీ సత్యనారాయణ, డీపీఆర్ రత్నకుమారి, కార్యనిర్వాహక సభ్యులుగా బి.సూర్యతేజ, జీఎస్‌కే వీవీ ప్రసాద్, ఎస్‌కే హుస్సేన్ తదితరులు ఎన్నికయ్యారు.

ముగిసిన అంకాలజిస్టుల రాష్ట్ర సదస్సు

రాజానగరం: రేడియేషన్ అంకాలజీలో ప్రోటాన్‌థెరపీ ఖర్చుతో కూడినదైనప్పటికీ ప్రభుత్వం ఈ యూనిట్‌ను నెలకొల్పి మధ్యతరగతి వర్గాలకు అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ ప్రక్రియ దేశమంతటా క్రమంగా విస్తరిస్తుందని జీఎస్ఎల్ వైద్య కళాశాల రేడియేషన్ అంకాలజిస్టు డాక్టర్ డీఎస్ రాజునాయుడు అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో క్యాన్సర్ నివారణలో ప్రాచుర్యం పొందిన ప్రోటాన్‌థెరపీపై రెండు రోజుల పాటు నిర్వహించిన రేడియేషన్ అంకాలజిస్టుల రాష్ట్ర స్థాయి నాల్గో సమ్మేళనం ఆదివారంతో ముగిసింది. 'రేడియేషన్ థెరపీలో ఎదురయ్యే సవాళ్లు- పరిష్కారాలు' అనే అంశంపై పలువురు వైద్యులు పేపర్ ప్రజెంటేషన్ ద్వారా తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ల సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 110 మంది రేడియేషన్ అంకాలజిస్టులు పాల్గొన్నారని, 18 అంశాలపై సెమినార్లు జరిగాయని డాక్టర్ పీబీ ఆనందరావు తెలిపారు. జీఎస్ఎల్ చీఫ్ మెంటర్ డాక్టర్ గన్ని భాస్కరరావు, అంకాలజిస్టు డాక్టర్ గోగినేని తరుణ్, డాక్టర్ గన్ని సందీప్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతను యజ్ఞంలా తీసుకుందాం..


విద్యార్థులతో కలసి శ్రమదానం చేస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

రాజానగరం: యువత స్వచ్ఛతను ఒక యజ్ఞంగా తీసుకోవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు స్వచ్ఛతా హి సేవ- ఒక రోజు, ఒక గంట కార్యక్రమాన్ని విద్యార్థులతో కలసి యూనివర్సిటీ ప్రాంగణంలో ఆదివారం చేపట్టారు. విద్యార్థులు ఇంటి వద్ద తల్లిదండ్రులకు సహాయ పడుతూనే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ఇరుగుపొరుగు వారిని చైతన్య పర్చాలన్నారు. సమాజం పట్ల యువత బాధ్యతాయుతంగా వ్యవహరిస్తే పెద్దలలో కూడా మార్పు వస్తుందని, తద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు ప్రజారోగ్యాన్ని కూడా కాపాడవచ్చన్నారు. స్వచ్ఛతా హి సేవ ఒక రోజు, ఒక గంటకు పరిమితం కాదని, నిత్యం మనం ఆచరించేందుకు దీనిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ అనుబంధ కళాశాలలో 290 వరకూ ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయని, వీరంతా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం శ్రమదాన్ స్వచ్ఛతపై అంతా కలసి ప్రతిజ్ఞ చేశారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఇన్‌చార్జి ఆచార్య పి.సురేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రతకు ప్రజల భాగస్వామ్యం అవసరం


కోటిలింగాల రేవులో చీపుర్లతో ఊడ్చుతున్న ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రధాని మోదీ పిలుపులో భాగంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని ఓఎన్జీసీ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అసెట్ మేనేజర్ అమిత్ నారాయణ్ అన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం అసెట్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కోటిలింగాల రేవును శుభ్రం చేశారు. ఆదివారం ఉదయం ఒక గంట పాటు సుమారు 300 మంది ఓఎన్జీసీలోని వివిధ విభాగాల ఉద్యోగులు, అధికారులు, పాఠశాల విద్యార్థులు, ఎస్పీఎఫ్, నగరపాలక సంస్థ సిబ్బంది, విద్యాశాఖ సిబ్బంది స్వయంగా చీపుర్లు పట్టి శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమిత్ నారాయణ్ మాట్లాడుతూ ప్రధాని పిలుపు మేరకు సామాజిక సేవా బాధ్యతతో కోటిలింగాల రేవును శుభ్రం చేసే కార్యక్రమాన్ని ఓఎన్జీసీ నిర్వహించిందన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుందన్నారు. తమ ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్టుగానే నగరాన్ని, పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.